క్లుప్తంగా

వలంటీర్లు సంక్షేమ సారథులు



కైలాసపట్నంలో సత్కారం పొందిన వలంటీర్లతో నాయకులు

కోటవురట్ల: ప్రభుత్వానికి, ప్రజలకు సంధానకర్తలుగా వలంటీర్లు ఉత్తమ సేవలందిస్తున్నారని ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు అన్నారు. కైలాసపట్నంలో ఉత్తమ సేవలందించిన వలంటీర్లకు గురువారం సత్కార కార్యక్రమం నిర్వహించారు. మాజీ సర్పంచ్ సిద్ధాబత్తుల నాగేశ్వరరావు చేతుల మీదుగా వలంటీర్లను ఘనంగా సత్కరించి, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఎక్కడా అవినీతికి తావులేకుండా వలంటీర్లు పారదర్శకంగా సేవలందిస్తున్నారని కితాబునిచ్చారు. సర్పంచ్ పెన్నాడ నూకరత్నం, ఎంపీటీసీ వెంకటరమణ పాల్గొన్నారు.

వీఆర్వోల జిల్లా అసోసియేషన్ డైరీ ఆవిష్కరణ



వీఆర్వోల జిల్లా అసోసియేషన్ డైరీ ఆవిష్కరిస్తున్న దృశ్యం

మునగపాక : మునగపాక మండల రెవెన్యూ కార్యాలయంలో గురువారం వీఆర్వోల జిల్లా అసోసియేషన్ డైరీ ఆవిష్కరణ జరిగింది. వీఆర్వోల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రామకాసు, కార్యదర్శి అనంత రామయ్యలు డైరీలను అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు జోగినాయుడు, డివిజన్ అధ్యక్షుడు గణపతి, ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, మండల అధ్యక్షుడు రమేష్, కార్యదర్శి వీరన్న పాల్గొన్నారు.

చురుగ్గా రీ-సర్వే పనులు



మునగపాక సత్తెమ్మతల్లి గుడి పరిసరాల్లో రీ-సర్వే చేస్తున్న అధికారులు

మునగపాక : మునగపాక సత్తెమ్మతల్లి గుడి పరిసరాల్లో గురువారం రీ-సర్వే లోపాల సవరణ పనులు చురుగ్గా సాగుతున్నాయి.గతంలో ప్రభుత్వం ద్వారా తీసుకున్న పట్టాదారు పుస్తకాల్లో కొంతమంది రైతులకు చెందిన భూముల వివరాలు సక్రమంగా లేకపోవడంతో వాటిని సరిచేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. విస్తీర్ణానికి సంబంధించి తేడాలుంటే వాటిని సవరించే పనిలో అధికారులు బిజీగా ఉన్నారు. రీ-సర్వే డీటీ పడాల్, వీఆర్వో హిమబిందు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

నక్కపల్లి ఎస్ఐగా గఫూర్



ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన గఫూర్

నక్కపల్లి : స్థానిక ఎస్ఐగా గఫూర్ నియమితులయ్యారు. ఇక్కడ పనిచేసిన ఎస్ఐ విభీషణ్‌రావును ఎస్.రాయవరం బదిలీ చేశారు. ఈ స్టేషన్‌ను సర్కిల్‌గా అప్‌గ్రేడ్ చేసి సీఐ(ఎస్‌హెచ్‌వో)గా అంబటి విజయ్‌కుమార్‌ను ప్రభుత్వం నియమించగా ఆయన 20 రోజుల క్రితం బాధ్యతలు చేపట్టారు. తాజాగా ఎస్ఐగా శ్రీకాకుళం జిల్లాలో పనిచేస్తున్న గఫూర్‌ను నియమించడంతో గురువారం ఆయన బాధ్యతలు చేపట్టారు. సిబ్బంది ఆయనను అభినందించారు.

చురుగ్గా గంగాలమ్మతల్లి గుడి నిర్మాణ పనులు



మూలపేటలో గంగాలమ్మ తల్లి గుడి శ్లాబ్ పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

మునగపాక: మండలంలోని మూలపేటలో నూతనంగా నిర్మిస్తున్న గంగాలమ్మతల్లి గుడి శ్లాబ్ పనులు గురువారం ప్రారంభమయ్యాయి. భక్తుల విరాళాలతో నిర్మిస్తున్న ఆలయం స్లాబ్ పనుల్లో గ్రామస్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ పునర్నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

వలంటీర్లవి నిస్వార్థమైన సేవలు

- కరోనాలోనూ ప్రాణాలకు తెగించి పని చేశారు
- వలంటీర్లను సత్కరించిన సమన్వయకర్త కంబాల జోగులు



నక్కపల్లిలో వలంటీర్లను సన్మానిస్తున్న కంబాల జోగులు

నక్కపల్లి : వలంటీర్లవి నిస్వార్థమైన సేవలని, వారు కరోనా సంక్షోభంలో ప్రాణాలకు తెగించి విధులు నిర్వహించి ప్రజల ప్రాణాలను, ప్రభుత్వ ప్రతిష్ఠను కాపాడారని పాయకరావుపేట సమన్వయకర్త, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. గురువారం ఆయన నక్కపల్లిలో వలంటీర్లకు వందనం పేరుతో వలంటీర్లను సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి 50 కుటుంబాలకు ఒక వలంటీర్లను నియమించి ప్రభుత్వ సంక్షేమ పథకాలను దళారుల ప్రమేయం లేకుండా అందించిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డి సర్కారుదేనన్నారు. ఈ ప్రభుత్వం వచ్చిన ఐదేళ్లలో నాయకులకు కూడా ఇవ్వని ప్రాధాన్యం వలంటీర్లకు జగనన్న సర్కారు ఇచ్చిందన్నారు. ప్రభుత్వం ద్వారా మంజూరు చేసిన సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారులకు అందుతున్నాయంటే వలంటీర్ల పనితీరే కారణమన్నారు. ఎటువంటి లాభాపేక్ష లేకుండా కేవలం ఐదువేల రూపాయల గౌరవ వేతనంతో వీరు పని చేస్తున్నారన్నారు. వలంటీర్లు పైసా లంచం తీసుకోకుండా పనిచేస్తుంటే ప్రతిపక్ష పార్టీలు, ఎల్లో మీడియా వారిపై విషం చిమ్ముతున్నాయన్నారు. వలంటీర్లు ఎంత నిస్వార్థపరులో తమకు, తమ ప్రభుత్వానికి, ప్రజలకు తెలుసన్నారు. వచ్చే ఎన్నికల్లో జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. ప్రభుత్వం మారితే వలంటీర్ల వ్యవస్థను రద్దు చేస్తామని పవన్‌కల్యాణ్, లోకేష్, చంద్రబాబు ప్రతి సమావేశంలోను చెబుతున్నారన్నారు. ఐదు వేల రూపాయల గౌరవ వేతనంతో కుటుంబాలను పోషించుకుంటున్న వలంటీర్ల పొట్ట కొట్టేందుకు ప్రతిపక్ష పార్టీలు కుట్ర చేస్తున్నాయన్నారు. దీన్ని వలంటీర్లు గుర్తుంచుకోవాలన్నారు. 50 కుటుంబల అవసరాలు తీర్చే అవకాశం మీకు కలిగిందన్నారు. మీ సేవలను గుర్తించిన ప్రభుత్వం సేవామిత్ర, సేవారత్న, సేవా వజ్ర పేరుతో రూ.15 వేలు, రూ.20 వేలు, రూ.45వేలు ఇచ్చి సత్కరిస్తోందన్నారు. గతంలో జన్మభూమి కమిటీలు ప్రజలను దోపిడీకి పాల్పడేవారన్నారు. మళ్లీ అటువంటి దోపిడీ వ్యవస్థను ఏర్పాటు చేసేందుకే టీడీపీ జనసేనలు వలంటీర్ల వ్యవస్థను రద్దు చేస్తామంటున్నారన్నారు. ప్రజల్లో మీపై ఎంత విశ్వాసం, గుర్తింపు ఉందో గ్రహించుకోవాలన్నారు. కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, జెడ్పీటీసీ కాసులమ్మ, ఎంపీపీ రత్నం తదితరులు మాట్లాడుతూ విధి నిర్వహణలో అలసత్వం వహించొద్దన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు వెలగా ఈశ్వరరావు, వీసం నానాజీ, పీఏసీఎస్ అధ్యక్షుడు పాపారావు, తాతబాబు, సర్పంచ్‌లు రత్నకుమారి, పి.వెంకటేష్, అల్లు రమణ, వియ్యపు శ్రీను, నాగ అప్పలరాజు, భార్గవ్, ఎంపీటీసీలు లొడగల చంద్రరావు, గొర్ల గోవిందు, బచ్చలరాజు, జేసీఎస్ జిల్లా కన్వీనర్ సూరాకాసుల గోవిందు, సింహాచలం దేవస్థానం సభ్యురాలు శేషారత్నం, ఎంపీడీవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకృష్ణుని విగ్రహ ప్రతిష్ట



మునగపాకలో శ్రీ కృష్ణుని విగ్రహాన్ని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

మునగపాక : స్థానిక సంతబయిల శ్రీ కృష్ణుని దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. మూడు రోజులుగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా భక్తి శ్రద్ధలతో హోమాలు నిర్వహించారు. దేవాలయ పైభాగం నుంచి విసిరిన బూరెలను పట్టుకునేందుకు భక్తులు పోటీ పడ్డారు. ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ తదితరులు విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన కోలాటం ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. ఆలయ ప్రాంగణంలో భారీగా అన్న సమారాధన జరిపారు.

వైఎస్సార్ కంటి వెలుగుతో ప్రజలకు మేలు



కంటి రోగులకు కళ్లజోళ్లు అందజేస్తున్న తిమ్మరాజుపేట ఉపసర్పంచ్ జగన్

మునగపాక : వైఎస్సార్ కంటి వెలుగు ద్వారా నిరుపేద ప్రజలకు మేలు జరుగుతుందని తిమ్మరాజుపేట ఉప సర్పంచ్ కాండ్రేగుల జగన్ పేర్కొన్నారు. వైఎస్సార్ కంటి వెలుగు ద్వారా వైద్య పరీక్షలు చేసుకొని కంటి ఆపరేషన్లు జరుపుకున్న వారికి గురువారం ఆయన కళ్లజోళ్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కంటి విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి ఆరునెలల కొకసారి కంటి పరీక్షలు చేసుకోవాలన్నారు. సచివాలయ కన్వీనర్ శరగడం రామభద్రనాయుడు, వైద్య సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

మునగపాక మండల అభివృద్ధికి సహకరించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ జయలక్ష్మి

మునగపాక: మండల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎంపీపీ మళ్ల జయలక్ష్మి కోరారు. మునగపాక మండల సర్వసభ్య సమావేశం గురువారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ జయలక్ష్మి మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయం చేసుకొని మండలాన్ని అభివృద్ధి చేసుకోవాలన్నారు. అలాగే గ్రామాల్లో సమస్యలపై అధికారులు దృష్టి సారించాలన్నారు. మండల స్థాయి అధికారులు మండల సమావేశానికి పూర్తి స్థాయిలో హాజరయ్యేలా చూడాలని పలువురు సభ్యులు సభ దృష్టికి తీసుకువచ్చారు. ఇకపై జరిగే మండల సమావేశానికి ప్రతి అధికారి అందుబాటులో ఉండాలన్నారు. ప్రభుత్వం ద్వారా మంజూరైన నిధులతో గ్రామాల్లో రహదారులు, బోర్లు వంటి సదుపాయాలు కల్పించేలా చూడాలని కోరారు. అనంతరం అధికారులు తమ శాఖాపరమైన ప్రగతిని సభలో చదివి వినిపించారు. వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని పలువురు కోరారు.ఎంపీడీవో మన్మథరావు, డీటీ వినయ్, మండల పరిషత్ సూపరింటెండెంట్ ప్రసాద్, వైస్ ఎంపీపీలు బోజా లక్ష్మి, చిందాడ దేవితో పాటు పలువురు సర్పంచ్‌లు,ఎంపీటీసీలు,అధికారులు సమావేశంలో పాల్గొన్నారు.

హైస్కూల్లో సందడిగా ఫేర్‌వెల్



విద్యార్థుల నృత్య ప్రదర్శన

కోటవురట్ల : పాములవాక జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థుల ఫేర్‌వెల్‌ను గురువారం ఘనంగా నిర్వహించారు. హెచ్‌ఎం కె.ఎల్.నారాయణ ఆధ్వర్యంలో విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థుల లఘు నాటికలు, నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేటలో సిద్ధం సభకు సిద్ధం కండి



మాట్లాడుతున్న జిల్లా పార్టీ అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, చిత్రంలో కంబాల జోగులు, పార్టీ నాయకులు



హాజరైన వైఎస్సార్‌సీపీ శ్రేణులు

ఎస్.రాయవరం : వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి వచ్చే ఎన్నికల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మరోమారు సీఎంగా గెలిపించుకోవాలని అనకాపల్లి జిల్లా వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, పాయకరావుపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ కంబాల జోగులు అన్నారు. అడ్డురోడ్డులో గురువారం జరిగిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఈనెల 26న పాయకరావుపేట నియోజకవర్గ సిద్ధం సభ విజయవంతం చేయాలన్నారు. రీజనల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి సమక్షంలో తొలిసారిగా ఎన్నికల సభ నిర్వహించనున్నట్టు చెప్పారు.

బలమైన నాయకత్వంతో ఉన్న పాయకరావుపేట నియోజకవర్గంలో అన్ని సర్వేలు వైఎస్సార్‌సీపీ వైపే ఉన్నాయన్నారు. 45 రోజుల వ్యవధిలో ఎన్నికలు రానున్నాయని, ప్రతి ఒక్కరూ సిద్ధంగా ఉండాలన్నారు. గ్రామ వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు సమన్వయంతో ఎన్నికలకు సిద్ధం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, ఎస్.రాయవరం, పాయకరావుపేట మండల పార్టీ అధ్యక్షులు బొలిశెట్టి గోవిందు, చిక్కాల రామారావు, మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు, జిల్లా పార్టీ కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు, ఎంపీపీ లోవలక్ష్మి, జెడ్పీటీసీలు కాకర దేవి, లంక సూరిబాబు, కాసులమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు పోలిశెట్టి పెదఈశ్వరరావు, శ్రీపతిరాజు, చంద్రరావు, పుట్టా సుధాకర్, మధువర్మ, పైలా రమేష్, కుమార్‌రాజా, సూర్యచలపతిరావు, తాతారావు, శేషారత్నం, పాయకరావుపేట పీఏసీఎస్ చైర్‌పర్సన్ దేవవరపు రాజేష్‌ఖన్నా, ప్రచార విభాగం అధ్యక్షుడు సాయిబాబా, సూరకాసుల గోవిందు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

ఎస్.రాయవరం:ఎస్.రాయవరం పరిసర ప్రాంతం రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టుకున్నట్టు ఎస్ఐ విభీషణరావు తెలిపారు.అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తుండగా సమాచారం రావడంతో ఈ ట్రాక్టర్లు పట్టుకుని అపరాధ రుసుము కట్టించామన్నారు. అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవన్నారు.

కన్యకాపరమేశ్వరికి విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో కన్యకాపరమేశ్వరి

అనకాపల్లి: స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయంలో గురువారం 1,008 గాజులతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ అర్చకుడు కమల శర్మ అమ్మవారికి సహస్ర నామార్చన, నిత్యార్చన, కుంకుమార్చనలు వంటి విశేష పూజలు నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమంలో ఉత్సవ చైర్మన్ కోరుకొండ బుచ్చిరాజు, కో చైర్మన్ డాక్టర్ గ్రంధి శేషుకుమార్, ఆలయ అధ్యక్షుడు బిళ్లపాటి కృష్ణమోహన్, కార్యదర్శి కొరుపోలు జగదీశ్వరరావు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రక్తహీనతపై జాగ్రత్తలు అవసరం



విద్యార్థినితో ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు మింగిస్తున్న వైద్యాధికారి రమేష్

కశింకోట: విద్యార్థులు రక్తహీనత రాకుండా ముందు జాగ్రత్త చర్యలు పాటించాలని తాళ్లపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి యు.రమేష్ సూచించారు. మండలంలోని తాళ్లపాలెం హైస్కూల్‌లో గురువారం రక్తహీనతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తహీనత నివారణకు ఐరన్ ఎక్కువగా ఉండే ఆహార పదార్థాలు, పచ్చని ఆకుకూరలు తీసుకోవాలన్నారు. మునగాకు, చింతకూర, గోంగూర, తోటకూరల్లో ఐరన్ పుష్కలంగా లభిస్తుందని చెప్పారు. బెల్లం, ఉసిరి, ఎండుద్రాక్ష, మొలకెత్తిన పప్పు ధాన్యాలు తీసుకోవాలన్నారు.

హెల్త్ ఎడ్యుకేటర్ ఎంఎస్‌వీ ప్రసాద్ మాట్లాడుతూ రక్తహీనత నివారణకు ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలను విద్యార్థులు క్రమం తప్పకుండా తీసుకోవాలని సూచించారు. విద్యార్థులతో ఆ మాత్రలు మింగించారు. హెల్త్ అసిస్టెంట్ ఆర్‌వీవీ సత్యనారాయణ, హెచ్‌ఎం వై.విజయలక్ష్మి సుమన్, సైన్స్ టీచర్ వి.లక్ష్మీసుధ, హెల్త్ అంబాసిడర్ టీచర్లు కె.కిరణ్మయి, కె.రాధ, పి.సుజాత, వై.శ్రీనివాసరావు, హెల్త్ సూపర్‌వైజర్ కేఎస్‌ఆర్‌కేజీ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు 'ఆరోగ్య సురక్ష' శిబిరం

కశింకోట: మండలంలోని నూతల గుంటపాలెం సచివాలయంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు తాళ్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి యు.రమేష్ తెలిపారు. ఉదయం 9 గంటలకు వైద్య శిబిరం ప్రారంభమవుతుందన్నారు. ప్రత్యేక వైద్యులు, స్థానిక వైద్యులు, కంటి వైద్య నిపుణులు హాజరై రోగులను పరీక్షించి అవసరమైన వారికి రక్త పరీక్షలు, ఈసీజీ పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేస్తారని చెప్పారు. ఈ అవకాశాన్ని నూతలగుంటపాలెంతోపాటు సచివాలయ పరిధిలోని ఏనుగుతుని, ఇతర గ్రామస్తులు వినియోగించుకోవాలని కోరారు.

వినాయక ఆలయ వార్షికోత్సవం రేపు

అనకాపల్లి: మండలంలోని శారదా నగర్ మెయిన్ రోడ్డులో గల వినాయక ఆలయ 41వ వార్షికోత్సవం ఈ నెల 24న నిర్వహించనున్నట్లు ఆలయ ప్రతినిధి బీశెట్టి జగన్, గ్రామ సర్పంచ్ సప్పారపు లక్ష్మీప్రసన్న గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శనివారం తెల్లవారుజాము నుంచి ఆలయ ఆవరణలో వినాయకుడికి ప్రత్యేక పూజలు, గణపతి హోమం వంటి కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన, రాత్రికి నేలవేషాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు వారు చెప్పారు.

అభాగ్యులకు అండగా సీఎంఆర్ఎఫ్



సీఎం రిలీఫ్ ఫండ్ అందజేస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

మునగపాక : సీఎం రిలీఫ్ ఫండ్‌ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు కోరారు. చూచుకొండ గ్రామానికి చెందిన తనకాల శ్రావణి ఏడాదిన్నర క్రితం ఆడబిడ్డకు జన్మనిచ్చింది. అయితే బిడ్డ అనారోగ్యం కారణంగా పలు ఆసుపత్రుల్లో వైద్యం చేయించినా ఫలితం లేకపోవడంతో మృతి చెందింది. ఈ సమయంలో రూ.2 లక్షలకు పైగా ఖర్చు చేశారు. దీంతో నిరుపేద శ్రావణి కుటుంబం ఆర్థిక ఇబ్బందుల కారణంగా సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. దీనిలో భాగంగా గురువారం మునగపాకలో శ్రావణి భర్త భార్గవ్‌కు రూ.70వేల చెక్కును ఎమ్మెల్యే రమణమూర్తిరాజు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతోమందిని ఆదుకుంటుందన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, చూచుకొండ ఎంపీటీసీ కాండ్రేగుల కిరణ్‌కుమార్, ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అచ్చియ్యనాయుడు పాల్గొన్నారు.

దళితవాడలో రామాలయాన్ని సందర్శించిన అధికారులు



మాట్లాడుతున్న హిందూ ధర్మ ప్రచార పరిషత్ క్లస్టర్ సూపరింటెండెంట్ శర్మ

మునగపాక : మునగపాక దళితవాడలో నూతనంగా నిర్మిస్తున్న రామాలయాన్ని గురువారం తిరుమల తిరుపతి దేవస్థాయం హిందూ ధర్మ ప్రచార సమితి క్లస్టర్ సూపరింటెండెంట్ ఎస్.కె.సి.ఎం శర్మ సందర్శించారు. సంబంధిత దేవాలయానికి అవసరమయ్యే విగ్రహాలు సమకూర్చాలని స్థానిక ఎమ్మెల్యే యు.వి. రమణమూర్తిరాజు తిరుమల తిరుపతి దేవస్థానం దృష్టికి తీసుకువచ్చిన నేపథ్యంలో శర్మ ఆలయాన్ని పరిశీలించారు. విగ్రహాల ఏర్పాటుకు అనువుగా ఆలయం నిర్మించారా లేదా అలాగే విగ్రహాల ఆవశ్యకత ఉందా అనే వివరాలు సేకరించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తాను ఆలయాన్ని సందర్శించానని ఇందుకు సంబంధించిన నివేదికను అందజేస్తానని శర్మ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ దిమ్మల అప్పారావు, పీఏసీఎస్ అధ్యక్షుడు కోనపల్లి రామ్మోహనరావు, దళిత నాయకులు పిల్లి అప్పారావు, రాజాన బుజ్జి, కరణం గణేష్, దిమ్మల నూకరాజు బీలా శివగణేష్ పాల్గొన్నారు.

మేలుజాతి పశువుల పెంపకంపై దృష్టి సారించాలి



పశు వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి ప్రసాదరావు

మునగపాక : పల్లపు ఆనందపురంలో గురువారం ఏర్పాటు చేసిన ఉచిత పశు వైద్యశిబిరానికి రైతుల నుంచి విశేష స్పందన వచ్చింది. రిలయన్స్ ఫౌండేషన్, జిల్లా పశు సంవర్ధకశాఖ సంయుక్త నిర్వహణలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని పశు సంవర్ధకశాఖ అధికారి ప్రసాదరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేలు జాతి పశువులను కొనుగోలు చేయడం ద్వారా పాల దిగుబడులు బాగుంటాయన్నారు. తద్వారా రైతులు ఆర్థికంగా నిలబడవచ్చన్నారు. అలాగే పశు పోషణ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. 25 పశువులకు గర్భకోశ పరీక్షలు, 20లేగ దూడలకు నట్టల నివారణ మందులు అందజేశారు. రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధులు తిరుమలరావు, రామచంద్రరావు, సర్పంచ్ కర్రి అప్పయమ్మ, అచ్యుతాపురం మండల సహాయక సంచాలకులు డాక్టర్ సునీల్‌కుమార్, వైద్యులు బానుబాబు, కోదండరావు, పద్మజ పాల్గొన్నారు.

ఏళ్ల నాటి సమస్య పరిష్కారమైన వేళ..



కొత్తగా నిర్మించిన డ్రైనేజీ వద్ద నాయకులు

కోటవురట్ల : ఎన్నో ఏళ్లుగా దుర్గంధాన్ని భరించారు. సమస్య పరిష్కరించాలని నాయకులకు మొరపెట్టుకున్నారు. ప్రభుత్వాలు మారాయి. డ్రైనేజీ సమస్య తీరలేదు. ఇక జీవితాంతం ఈ దుర్గంధాన్ని భరించక తప్పదనుకున్నారు. కానీ సర్పంచ్ పైల శ్రీదేవి మంగా ఇందిర భవానీ మాత్రం వదిలిపెట్టలేదు. అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లి పరిష్కరించడంలో సఫలీకృతులయ్యారు. కె.వెంకటాపురంలోని వీవర్స్ కాలనీ నుంచి మరిడమ్మతల్లి ఆలయం వరకు రూ.10 లక్షలతో నిర్మించిన డ్రైనేజీని గురువారం ప్రారంభించారు. గతంలో ఇక్కడ డ్రైనేజీ లేకపోవడంతో స్థానికులు పడరాని పాట్లు పడ్డారు. రోడ్డుపైనే మురుగునీరు ప్రవహించేది. వాహనదారులు, పాదచారులు జారిపడి తీవ్ర ఇబ్బంది పడేవారు. సమస్యను తెలుసుకున్న సర్పంచ్ శ్రీదేవి మంగా ఇందిర భవానీ ఆమె భర్త వైఎస్సార్‌సీపీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు పైల రమేష్ సహకారంతో నిధులు మంజూరు చేయించి డ్రైనేజీ నిర్మాణం పూర్తి చేయించారు. దాంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రారంభోత్సవంలో ఉప సర్పంచ్ శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు పైల నాని పాల్గొన్నారు.


మాఘపౌర్ణమి జాతర ఏర్పాట్లు పరిశీలించిన డీఎస్పీ



రేవుపోలవరం తీరంలో పర్యటిస్తున్న డీఎస్పీ వెంకట్రామయ్య తదితరులు

ఎస్.రాయవరం : రేవుపోలవరం తీరంలో ఈ నెల 24 న జరిగే మాఘ పౌర్ణమి జాతరకు పగడ్బందీగా బందోబస్తు నిర్వహించాలని నర్సీపట్నం డీఎస్పీ వెంకట్రామయ్య సూచించారు. రేవుపోలవరం తీరాన్ని గురువారం పరిశీలించారు. భక్తుల రద్దీ దృష్ట్యా అవసరమయిన సిబ్బందిని ప్రధాన ప్రదేశాల్లో పికెట్ నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ముందురోజు రాత్రి నుంచి అవసరమైన పోలీస్ సిబ్బంది జాతర బందోబస్తు నిర్వహించడానికి సిద్ధంగా ఉంటారన్నారు. ప్రయివేటు వాహనాలు ఎక్కడ నుంచి ఎంతవరకు ప్రయాణించాలనేది ముందు తెలియపరిచి నియంత్రించాలన్నారు. ద్విచక్ర, వీఐపీ పార్కింగ్ కేటాయించాలన్నారు. సముద్రంలో స్నానానికి దిగేవారికి రక్షణకు గజ ఈతగాళ్లను ఏర్పాటు చేయాలన్నారు. జేబు దొంగల బెడద ఉండకుండా సిబ్బంది చూడాలన్నారు. ఆయన వెంట నక్కపల్లి సీఐ అప్పన్న, ఎస్ఐ విభీషణరావు తదితరులు ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందిస్తున్న మంత్రి దాడిశెట్టి రాజా

పాయకరావుపేట : మండలంలో గల 9 మంది బాధితులకు రాష్ట్ర రోడ్డు, భవనాల శాఖా మంత్రి దాడిశెట్టి రాజా సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఎస్.అన్నవరం గ్రామంలో గల మంత్రి దాడిశెట్టి రాజా గృహం వద్ద 9 మందికి రూ. 11.85 లక్షలు చెక్కులను పంపిణీ చేశారు. మండలంలో గల ఎస్.నర్సాపురం గ్రామానికి చెందిన మంచాల గంగాధర్‌కు రూ.2.70 లక్షలు, పాల్మన్‌పేట గ్రామానికి చెందిన మైలపల్లి దీనబాంధవ్‌కు శస్త్ర చికిత్స కోసం రూ.1.30 లక్షలు, పాయకరావుపేట చెందిన మహమ్మద్ హిదయతుల్లాకు కారు ప్రమాదం కారణంగా గాయాలు కావడంతో రూ. 2.40 లక్షలు, వీరితో పాటు మరో ఆరుగురు వ్యక్తులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గూటూరు శ్రీను, పార్టీ మాజీ మండల అధ్యక్షుడు ధనిశెట్టి బాబూరావు, వైస్ ఎంపీపీలు పల్లేల మణికంఠ స్వామి, ధనిశెట్టి మాధవి తిరుమల్లేశ్వరరావు, మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యులు కాధా రామకృష్ణ, మత్స్యకార నాయకులు మైలపల్లి అశోక్, నాయకులు కేశనకుర్తి సత్తిబాబు, తోట జమీలు, అనిశెట్టి వెంకటసూరి పాల్గొన్నారు.